క్లుప్తంగా

చురుగ్గా పైప్‌లైన్ మరమ్మతులు



కొత్త కరాసాలో పైప్‌లైన్ మరమ్మతు పనులు చేస్తున్న సిబ్బంది

గోపాలపట్నం: జీవీఎంసీ 52వ వార్డు కొత్త కరాసాలో మంచి సరఫరా పైప్‌లైన్ లీకేజీని అరికట్టడానికి శుక్రవారం సిబ్బంది మరమ్మతులు చేపట్టారు. రెండు రోజుల కిందట కరాసా నుంచి దుర్గాపురం సరఫరా అయ్యే పైప్‌లైన్ లీకవుతున్నట్టు అధికారులు గుర్తించారు. దీంతో శుక్రవారం మరమ్ముతు పనులు చేపట్టారు. శనివారం మంచినీరు సరఫరా చేస్తామని సిబ్బంది తెలిపారు.

ప్రమాదకరంగా ఫుట్‌పాత్



కరాసా నుంచి ఎన్‌ఏడీ వెళ్లే రహదారిలో ప్రమాదకరంగా ఉన్న ఫుట్‌పాత్

గోపాలపట్నం: జీవీఎంసీ 52వ వార్డు కరాసా నుంచి ఎన్‌ఏడీ వెళ్లే బీఆర్‌టీఎస్ ప్రధాన సరీ్వసు రోడ్డులో ఫుట్ పాత్ ప్రమాదకరంగా ఉంది. ఇక్కడి కార్ వాష్ సమీపంలో ఫుట్ పాత్‌పై మూత వేసిన పలక ఊడిపోయి ప్రమాదకరంగా మారింది. ఖాళీ స్థలంలో భారీ వాహనాలు పార్కింగ్ చేయడం వల్ల ఫుట్ పాత్ పాడైంది. దీంతో పలకలు ఊడిపోయి ఫుట్‌పాత్ డక్టుల్లో పడిపోయాయి. దీంతో పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి వీటిని బాగు చేయాలని కోరుతున్నారు.

మంత్రులకు సాదర స్వాగతం



మంత్రి ధర్మానతో జియ్యాని శ్రీధర్

గోపాలపట్నం: విజయవాడ నుంచి విశాఖ వచ్చిన పలువురు మంత్రులకు విమానాశ్రయంలో వైఎస్సార్ సీపీ నేతలు సాదర స్వాగతం పలికారు. ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు, మత్స్య పశుసంవర్ధక శాఖ మంత్రి సీదిరి అప్పలరాజు శుక్రవారం విశాఖ చేరుకున్నారు. వీరికి డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ తదితర నాయకులు స్వాగతం పలికారు.

గోతులు తవ్వారు.. కప్పడం మరిచారు



మల్కాపురం వద్ద అధ్వానంగా ప్రధాన మార్గం

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం కృష్ణా బార్ అండ్ రెస్టారెంట్ ఎదురుగా గల మార్గంలో ఇటీవల విద్యుత్ కేబుల్ ఏర్పాటు కోసం గోతులు తవ్వారు.అయితే పనులు పూర్తయిన తర్వాత తవ్విన గోతులను సరిగ్గా పూడ్చలేదు. దీంతో ఆ మార్గాన వచ్చే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వేగంగా వచ్చే వారు గోతులను గుర్తించలేక వాహనదారులు గాయాల పాలవుతున్నారు. అధికారులు స్పందించి గోతులు పూడ్చాలని వాహనదారులు కోరుతున్నారు.

విశేషంగా తిరువీధి



సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి ఆలయంలో శుక్రవారం సింహవల్లీ తాయారు అమ్మవారికి తిరువీధి విశేషంగా జరిగింది. అమ్మవారి ఉత్సవమూర్తిని పల్లకిలో అధిష్టపజేసి ఆలయ బేడామండపంలో తిరువీధి నిర్వహించారు. విశేషంగా హారతులు అందజేశారు.

అంతిమ సంస్కారాలకు అవస్థలు లేకుండా..

సాధారణంగా హిందువులు, క్రైస్తవులు, ముస్లింలకు విడివిడిగా శ్మశాన వాటికలు ఉంటాయి. కానీ జీవీఎంసీ 52వ వార్డులో మాత్రం ఇందుకు భిన్నంగా మూడు మతాల వారికి ఒకేచోట శ్మశానవాటికలు ఉండటం విశేషం. అయితే, ఎన్నో సంవత్సరాలుగా అభివృద్ధికి నోచుకోకపోవడంతో మృతుల బంధువులు ఇబ్బంది పడేవారు. దీంతో ప్రత్యేకతను సంతరించుకున్న ఈ శ్మశాన వాటిక అభివృద్ధికి స్థానిక కార్పొరేటర్, డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ చొరవ చూపారు. పనులు చకచకా జరుగుతున్నాయి. త్వరలోనే మృతుల బంధువుల అవస్థలు తొలగనున్నాయి.

- హిందూ, క్రిస్టియన్, ముస్లిం శ్మశానవాటిక అభివృద్ధి
- రూ.48.24 లక్షలతో చకచకా పనులు





కరాసా హిందూ, క్రిస్టియన్, ముస్లిం శ్మశాన వాటిక ముఖద్వారం

గోపాలపట్నం: ఆత్మీయుల మరణం ఎంతో దుఃఖాన్ని కలిగిస్తుంది. భారమైన మనసులతో అంతిమ వీడ్కోలు పలికేందుకు అధిక సంఖ్యలో బంధువులు, స్నేహితులు తరలివస్తారు. అయితే, అక్కడి పరిస్థితులు సరిగ్గా లేకపోతే, సరైన వసతులు లేకపోతే అంతిమ సంస్కారాలు సరిగ్గా చేయలేకపోయామని ఎంతో ఆవేదన చెందుతారు. కరాసా హిందూ, క్రిస్టియన్, ముస్లిం శ్మశాన వాటికలోనూ ఇదే పరిస్థితి ఉండేది. సరైన వసతులు లేక మృతుల బంధువులు ఇబ్బంది పడేవారు. వారి ఇబ్బందులకు చెక్ చెబుతూ శ్మశానవాటికలో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ఈ శ్మశానవాటికల అభివృద్ధికి రూ. 48.24లక్షల నిధులు వెచ్చిస్తున్నామని అధికారులు తెలిపారు. హిందూ శ్మశాన వాటికకు రూ.19,90,000, క్రిస్టియన్ శ్మశాన వాటికకు రూ10,72,000, ముస్లిం శ్మశాన వాటికకు రూ17,62,000 నిధులతో మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు చెప్పారు. పనులు త్వరితగతిన జరుగుతుండడంతో వార్డు ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

- హిందూ శ్మశాన వాటికలో శవదహన షెడ్డు మరమ్మతులు పూర్తి చేశారు. నూతనంగా మరో షెడ్డు నిర్మాణం పూర్తయింది. వెయిటింగ్ హాలు నిర్మాణ దశలో ఉంది. రహదారులు కొంతవరకు పూర్తయ్యాయి. నీటి సదుపాయం కల్పించాల్సి ఉంది.
- ముస్లిం శ్మశాన వాటికలో ఇప్పటి వరకు జంగిల్ క్లియరెన్స్ పూర్తి చేశారు. వెయిటింగ్ హాలు, మంచి నీటి సదుపాయం, విద్యుత్ దీపాలు, లాకర్స్ పనులు చేయాల్సి ఉంది.
- క్రిస్టియన్ వెయిటింగ్ హాలు మరమ్మతులు, మరియమ్మ విగ్రహం మరమ్మతులు, గెడ్డ రిటైనింగ్ వాల్, బోరు బావి పనులు జరుగుతున్నాయి.





శ్మశాన వాటికకు వెళ్లే మార్గం

ఇప్పుడిప్పుడే బాగుపడుతోంది



గతంలో హిందూ శ్మశాన వాటిక అధ్వానంగా ఉండేది. ఇప్పుడిప్పుడే బాగుపడుతోంది. మూడేళ్ల క్రితం దుర్గా వేమన సంఘం ఆధ్వర్యంలో శివుని విగ్రహం నిర్మించాం. శ్మశాన వాటిక ప్రాంతంలో శ్రమదానం చేసి తుప్పలను శుభ్రం చేశాం. కానీ, ఇప్పుడు అధికారులు శాశ్వత చర్యలు చేపట్టడం ఆనందంగా ఉంది. సుందరంగా తీర్చిదిద్దడం అభినందనీయం.

– నగిరెడ్డి రమణా రెడ్డి, దుర్గా వేమన సంక్షేమ సంఘం అధ్యక్షుడు, కరాసా

ఈ శ్మశాన వాటిక నగరానికే ఆదర్శం



మూడు మతాలకు సంబంధించిన శ్మశాన వాటికలు ఒక్కదగ్గరే ఉండడం విశేషం. కావున కరాస శ్మశానవాటిక నగరానికే ఆదర్శం. ఇక్కడి కాంపౌండ్‌లోని మూడు శ్మశానవాటికలు అందరి సహకారంతో అభివృద్ధి చేయడం సంతోషంగా ఉంది. ఇందుకు కృషి చేస్తున్న డిప్యూటీ మేయర్ శ్రీధర్‌కు కృతజ్ఞతలు.

– జ్ఞాన ప్రకాష్, శాంతినగర్

అడుగు పెట్టాలంటే భయంగా ఉండేది..



ముస్లిం శ్మశాన వాటిక తుప్పలతో నిండిపోవడంతో లోపలికి అడుగు పెట్టేందుకు భయపడేవాళ్లం. శ్మశాన వాటికలో సమస్యలపై డిప్యూటీ మేయర్‌కు, అధికారులకు వినతి పత్రాలిచ్చాం. వారు స్పందించి, అభివృద్ధికి శ్రీకారం చుట్టారు. జంగిల్ క్లియరెన్స్ అయింది. త్వరలో పనులు మొదలుపెడతానని చెబుతున్నారు. త్వరితగతిన పనులు పూర్తి చేయాలని కోరుతున్నాం.

– ఇబ్రహీం, శాంతినగర్

కనకదుర్గమ్మకు ప్రత్యేక పూజలు



కనకదుర్గమ్మకు పూజలు చేస్తున్న శర్మ

కంచరపాలెం: స్థానిక రెడ్డికంచరపాలెం కనకదుర్గ మ్మ ఆలయంలో, గొల్లకంచరపాలెం దుర్గానగర్‌లోని దుర్గామాంబ ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు శర్మ కనకదుర్గమ్మవారికి కుంకుమ పూజలు, పూలాభిషేకాలు, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. భక్తులకు ఆలయ కమిటీల సభ్యులు తీర్థప్రసాదాలు అందించారు.

కప్పరాడ పీహెచ్‌సీ సందర్శన



ఆరోగ్య కేంద్రంలో వివరాలు తెలుసుకుంటున్న వెల్‌నెస్ కన్సల్టెంట్ ప్రతినిధులు

కంచరపాలెం: జీవీఎంసీ 47వ వార్డు కప్పరాడలోని డాక్టర్ వైఎస్సార్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం రాష్ట్ర వైద్య ఆరోగ్య వెల్‌నెస్ కేంద్రాల కన్సల్టెంట్ ప్రతినిధి శాంతి సందర్శించారు. ఆరోగ్య కేంద్రంలో మహిళా, శిశు సంక్షేమానికి సంబంధించిన కార్యక్రమాలు అమలవుతున్న తీరును వైద్యులను అడిగి ఆమె తెలుసుకున్నారు. గర్భిణులకు రక్త పరీక్షలు చేసే విధానాలు, ఆరోగ్య కేంద్రం పరిసరాలను పరిశీలించారు. ఆరోగ్య కేంద్ర వైద్యులు డాక్టర్ నళిని, డాక్టర్ సనపల రాజేంద్ర, కన్సల్టెంట్ ప్రతినిధులు, వైద్య సిబ్బంది, ఆశ వర్కర్లు, సచివాలయ ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థి సుధాకర్‌కు మద్దతుగా ప్రచారం



కరపత్రం అందిస్తున్న సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్

కంచరపాలెం: జీవీఎంసీ 56వ వార్డు గొల్లకంచరపాలెం, తోటవీధి, దుర్గానగర్, గోకుల్‌నగర్, గౌరీనగర్ ప్రాంతాల్లో ఉత్తరాంధ్ర పట్టభద్రుల వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌కు మద్దతుగా శుక్రవారం ప్రచారం నిర్వహించారు. విశాఖ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ ఓటర్ల ఇంటింటికీ వెళ్లి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బలపరిచిన అభ్యర్థి సుధాకర్‌కు మొదటి(1) ప్రాధాన్యత ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు ఆడారి శ్రీనివాసరావు, క్లస్టర్ ఇన్‌చార్జి పల్లా ఎర్నికుమార్, సర్వసిద్ధి సాయిలత, గ్రామాధ్యక్షుడు పల్లా సత్యనారాయణ, 60వ వార్డు కార్పొరేటర్ పీవీ సురేష్, నాయకులు నమ్మి శ్రీను, మజ్జి నూకరాజు, శామ్యూల్ పాల్గొన్నారు.

నిరుద్యోగులకు ఉచిత శిక్షణ, ఉద్యోగం

అక్కిరెడ్డిపాలెం: డిగ్రీ పాసైన నిరుద్యోగులకు ఉచిత శిక్షణ ఇచ్చి, ఉద్యోగావకాశాలు కల్పించనున్నట్లు బొల్లినేని మెడ్‌స్కిల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్.నాగేశ్వరరావు శుక్రవారం తెలిపారు. హెల్త్ కేర్ బిల్లింగ్, హాస్పిటల్ ఫ్రంట్ డెస్క్ కో–ఆర్డినేటర్, పేషెంట్ రిలేషన్ ఎగ్జిక్యూటివ్ కోర్సుల్లో శిక్షణ ఇస్తామని చెప్పారు. 20 నుంచి 30 ఏళ్ల మధ్య వయసు గలిగి, ఏదైనా డిగ్రీ పూర్తి చేసిన అభ్యర్థులు అర్హులని తెలిపారు. ఈ నెల 27 నుంచి శిక్షణ తరగతులు ప్రారంభమవుతాయని, శిక్షణ అనంతరం కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఉద్యోగావకాశాలు కల్పిస్తామని తెలియజేశారు. ఇతర వివరాలకు షీలానగర్ కిమ్స్ ఐకాన్ ఆస్పత్రిలో నేరుగా లేదా 72079 53919, 76708 58199, 76809 45357 నంబర్ల ద్వారా ఫోన్‌లో సంప్రదించాలని సూచించారు.

ఎఫ్‌డీఏ బృందం అమెరికన్ కార్నర్ సందర్శన



అమెరికన్ కార్నర్‌లో ఎఫ్‌డీఏ బృందం సభ్యులు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయంలోని అమెరికన్ కార్నర్‌ను అమెరికాలోని ఎఫ్‌డీఏ డ్రగ్ క్వాలిటీ డివిజన్ డైరెక్టర్ డాక్టర్ కార్మిలో రోసాతో కూడిన ప్రతినిధుల బృందం శుక్రవారం సందర్శించింది. ఈ సందర్భంగా గతేడాది కాలంలో అమెరికన్ కాన్సులేట్ సహకారంతో 40 కార్యక్రమాలను నిర్వహించినట్టు కేంద్రం సమన్వయకర్త ఆచార్య జేమ్స్ స్టీఫెన్ తెలిపారు. గతేడాది కాలంలో నిర్వహించిన కార్యక్రమాల వివరాలను ఆయన వివరించారు. ఏయూతో అమెరికన్ కాన్సులేట్‌కు ఉన్న అనుబంధం తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి, రెక్టార్ ఆచార్య కె.సమత, రిజిస్ట్రార్ ఆచార్య ఎన్.కిషోర్ బాబు, పూర్వ రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, యూఎస్ కంజ్యూమర్ సేఫ్టీ ఆఫీసర్ సలీమ్ అక్తర్, సీనియర్ పాలసీ అడ్వైజర్ బ్రూక్ హిగ్గిన్స్, ఓఆర్‌ఏ నేషనల్ ఎక్స్‌పర్ట్ జోన్ మెలెంజ్, అమెరికాకు చెందిన వయాట్రిస్ గ్లోబల్ క్వాలిటీ వైస్ ప్రెసిడెంట్ దేవ పురాణం, ఏయూ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య వై.రాజేంద్రప్రసాద్, అంతర్జాతీయ విద్యార్థి వ్యవహారాల డీన్ ఆచార్య ధనుంజయరావు, పాలక మండలి సభ్యురాలు ఎ.కె.ఎం.పవార్, పాల్గొన్నారు.

వైభవంగా నిత్యకల్యాణం



జీలకర్రబెల్లం ఘట్టం నిర్వహిస్తున్న అర్చకుడు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శుక్రవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవ మూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కమనీయంగా నిర్వహించారు. ఉభయదాతలకు అక్షింతలు, శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు.

కార్మికుల పోరాటం అద్వితీయం

సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు రాఘవులు



దీక్షా శిబిరం వద్ద మాట్లాడుతున్న సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సుదీర్ఘంగా పోరాటాలు చేస్తున్న కార్మికులు అభినందనీయులని సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యుడు బి.వి. రాఘవులు అన్నారు. విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ ఆధ్వర్యంలో కూర్మన్నపాలెం జంక్షన్‌లో చేపట్టిన రిలే నిరాహారదీక్షలు శుక్రవారం నాటికి 743వ రోజుకు చేరుకున్నాయి. ఈ శిబిరంలో స్టీల్‌ప్లాంట్ ఎల్‌ఎంఎంఎం, ఎస్‌టీఎం విభాగాల ప్రతినిధులు కూర్చున్నారు. ఈ సందర్భంగా ఆయన శిబిరాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను సమర్థిస్తున్న సమయంలో, కార్మికుల నుంచి ఇటువంటి ప్రతిఘటనను ఎదుర్కోవడం ఆ పార్టీ నేతలకు మింగుడుపడడం లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం ఎలాగైనే విశాఖ ఉక్కును ప్రైవేటు పరం చేయాలని చూస్తోందన్నారు. దేశంలో, రాష్ట్రంలో అన్ని రాజకీయ పక్షాలను ఏకం చేయడం ద్వారా, దానిని తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ ప్రతినిధులు డి.ఆదినారాయణ, జె.అయోధ్యరామ్, కె.సత్యనారాయణరావు, రామస్వామి, వై.టి. దాస్, సంపూర్ణం, సీహెచ్ సన్యాసిరావు, తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదులన్నీ అక్రమ, అనధికార కట్టడాలపైనే..

జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో టౌన్ ప్లానింగ్ స్పందన



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న పట్టణ ప్రణాళికాధికారి సురేష్‌కుమార్

దాబాగార్డెన్స్: జీవీఎంసీ అన్ని జోన్లలో చేపడుతున్న నిర్మాణాలపై పట్టణ ప్రణాళికా విభాగం శుక్రవారం స్పందన నిర్వహించింది. అక్రమ.. అనధికార కట్టడాలపైనే ఫిర్యాదులన్నీ వచ్చాయి. జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రధాన పట్టణ ప్రణాళికాధికారి బి.సురేష్‌కుమార్ ఫిర్యాదులు స్వీకరించారు. వాటి వివరాలిలా.. జోన్–1 నుంచి భీమిలి చిట్టివలసకు చెందిన జి.శ్రీనివాసరావు జోన్ పరిధిలో అక్రమ, అనధికార నిర్మాణాలు జరుగుతున్నాయని ఫిర్యాదు చేయగా.. భీమిలికి చెందిన ఎస్.ఆర్.రాజు సంగివలస అనిట్స్ రోడ్డులో నిబంధనలకు విరుద్ధంగా అక్రమ కట్టడాలు జరుగుతున్నాయని ఫిర్యాదు చేశారు. జోన్–3 నుంచి పాత రేసపువానిపాలేనికి చెందిన హితేష్‌కుమార్ జైన్ టీడీఆర్ సరిఫికెట్ కోసం, నక్కవానిపాలెంలో అనధికార నిర్మాణాలు జరుగుతున్నాయని అదే ప్రాంతానికి చెందిన కర్రి గణపతి, శివాజీపాలెంలో అనధికార నిర్మాణాలు జరుగుతున్నాయని పి.ఎల్.వి.ఎన్.మూర్తి, పెదవాల్తేరుకు చెందిన తెడ్డు శంకరరావు ఫిర్యాదు చేశారు. జోన్–4 నుంచి 31వ వార్డు కార్పొరేటర్ బిపిన్‌కుమార్ జైన్ సూర్యాబాగ్ లైన్‌లో అక్రమ కట్టడాలు జరుగుతున్నాయని, ఎటువంటి సెట్‌బ్యాక్స్ లేకుండా నిర్మిస్తున్నారని, రెసిడెన్షియల్ ఏరియాలో కమర్షియల్ బిల్డింగ్స్ కడుతున్నారని ఫిర్యాదు చేశారు. జోన్–5 నుంచి సనపల నాగచంద్రుడు జోన్ పరిధిలో అక్రమ బిల్డింగ్ నిర్మాణాలకు జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ ఎలా అనుమతులు ఇచ్చిందని, జోన్‌లో అక్రమ నిర్మాణాలు తొలగించాలని తాటిచెట్లపాలేనికి చెందిన చిల్లా వెంకటస్వామి, దయాల్‌నగర్ నుంచి జె భువనేశ్వరిదేవి జోన్‌లో అక్రమ కట్టడాలు జరుగుతున్నాయని ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ సిటీ ప్లానర్ సంధ్య రత్నకుమార్, నరేంద్రనాథ్‌రెడ్డి, కె.పద్మజ, ఏసీపీలు, టీపీవో, టీపీఎస్‌లు పాల్గొన్నారు.

ప్రైవేటు స్కూల్ నిర్వాకం

హాల్ టికెట్లు అందక పరీక్ష రాయలేకపోయిన ఇద్దరు విద్యార్థులు



పరీక్ష కేంద్రం వద్ద ఆందోళన చేస్తున్న విద్యార్థులు, తల్లిదండ్రులు

పెదగంట్యాడ: ఓ ప్రైవేటు స్కూల్ నిర్వాకం ఇద్దరు విద్యార్థులకు శాపంగా మారింది. లక్షలాది రూపాయలు ఫీజులు చెల్లించినప్పటికీ ఆఖరి నిమిషంలో హాల్ టికెట్లు అందకపోవడంతో వారిద్దరూ పరీక్ష రాయలేకపోయారు. పెదగంట్యాడ వుడా కాలనీలోని టింపనీ స్కూల్ వద్ద శుక్రవారం జరిగిన ఈ సంఘటనకు సంబంధించి వివరాలిలా.. భీమిలి క్రాస్ రోడ్డులోని ది హార్బర్ ఇంటర్నేషనల్ స్కూల్‌కు చెందిన 43 మంది పదో తరగతి విద్యార్థులు సీబీఎస్‌ఈ పరీక్ష రాసేందుకు టింపనీ స్కూల్‌కు వచ్చారు. అందులో బొబ్బిలికి చెందిన బి.సాయి దుర్గ హర్షవర్థన్, నర్సీపట్నానికి చెందిన సూరిశెట్టి తరుణ్‌లకు హాల్ టికెట్లు అందజేయకపోవడంతో పరీక్ష కేంద్రం నుంచి ఉసూరుమంటూ బయటకు వచ్చేశారు. వెంటనే సంబంధిత పాఠశాలను సంప్రదిస్తే పరీక్ష సమయానికి వస్తాయని చెప్పడంతో వారు వేచి చూశారు. ఎంత సేపటికీ హాల్ టికెట్లు రాకపోవడం, తోటి విద్యార్థులంతా పరీక్ష కేంద్రంలోకి వెళ్లడంతో కన్నీటి పర్యాంతమయ్యారు. ఇది గమనించిన వారిద్దరి తల్లిదండ్రులతోపాటు మిగిలిన విద్యార్థుల పేరెంట్స్ ఆందోళనకు దిగారు. అక్కడికి వచ్చిన హార్బర్ స్కూల్ కరస్పాండెంట్ వైఎస్ నాయుడును నిలదీశారు. తమ పిల్లల భవిష్యత్తుతో ఆటలాడుకున్నారంటూ ఆవేదన చెందారు. సాంకేతిక కారణాల వల్లే ఆ ఇద్దరి విద్యార్థులకు సమయానికి హాల్ టికెట్లు ఇవ్వలేకపోయమని పాఠశాల యాజమాన్య ప్రతినిధులు చెప్పడంతో వారంతా ఆగ్రహానికి లోనయ్యారు. దీనిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. న్యూపోర్టు పోలీసులు పరీక్ష కేంద్రం వద్దకు చేరుకుని తల్లిదండ్రులకు నచ్చజెప్పడంతో పరిస్థితి సద్దుమణిగింది.

బ్యాడ్మింటన్‌లో త్రిషాలి, శ్రీకృష్ణకు స్వర్ణాలు



వితోలి బ్యాడ్మింటన్ విజేతలు

విశాఖ స్పోర్ట్స్: అమరావతి వీఐటీలో నిర్వహించిన వితోలి బ్యాడ్మింటన్ టోర్నీలో జి.త్రిషాలి వుమెన్ సింగిల్స్‌లో విజేతగా నిలిచింది. ఫైనల్స్‌లో పి.వి న్సీ(కె.ఎల్.యూ)పై 21–8, 21–8 పాయింట్ల తేడాతో విజయం సాధించి స్వర్ణాన్ని అందుకుంది. మెన్ ఫైనల్ సింగిల్స్‌లో శ్రీకృష్ణ 2–0 సెట్ల తేడాతో యశ్వంత్ (కె.ఎల్.యూ)పై, డబుల్స్‌లో ఎ.రూపేష్‌తో కలిసి స్ట్రయిట్ సెట్లలోనే సుల్తాన్–ఆదిత్య(వీఐటీ)జోడీపై విజయం సాధించి స్వర్ణాలందుకున్నారు. గీతం విద్యార్థులైన వీరంతా నాలుగు కేటగిరీల్లో పాల్గొని మూడు పతకాలు సొంతం చేసుకున్నారు.

అప్పుల బాధ తాళలేక యువకుడి బలవన్మరణం



నీలి మోహనకృష్ణ (ఫైల్)

అక్కిరెడ్డిపాలెం: అప్పుల బాధ తాళలేక ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గురువారం అర్ధరాత్రి జరిగిన ఘటనకు సంబంధించి గాజువాక ఎస్‌ఐ ఎం.రవికుమార్, మృతుడి తల్లి దండ్రులు తెలిపిన వివరాలివి.. భెల్ టౌన్ షిప్‌లో సెక్యూరిటీ గార్డ్‌గా విధులు నిర్వర్తిస్తున్న నీలి భావనారుషి, పార్వతి దంపతుల కుమారుడు మోహన కృష్ణ (28). వీరు భెల్ టౌన్‌షిప్ క్వార్టర్ ఎఫ్ – 65లో నివాసం ఉంటున్నారు. మోహన కృష్ణ వ్యాన్ కొనుక్కుని, స్వయంగా నడుపుకొనేవాడు. ఈ క్రమంలో 69వ వార్డు తుంగ్లాంకు చెందిన వాకాడ శ్రీనివాసరెడ్డి వద్ద రూ.40వేలు అప్పుగా తీసుకున్నాడు. అప్పు తీర్చమని నిత్యం వేధిస్తుండటంతో, గురువారం అర్ధరాత్రి తల్లిదండ్రులు నిద్రిస్తున్న సమయంలో వేరే గదిలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుని తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టనున్నట్లు ఎస్‌ఐ ఎం.రవికుమార్ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. అధిక వడ్డీలతో వేధింపులకు గురి చేస్తాడని శ్రీనివాసరెడ్డిపై ఎన్నో ఆరోపణలున్నాయని గ్రామస్తులు తెలిపారు. అతని వేధింపుల వల్లే తమ కుమారుడు మృతి చెందాడని తల్లిదండ్రులు ఫిర్యాదులో పేర్కొన్నారు. అందివచ్చిన కొడుకు తనువు చాలించడంతో వారు కన్నీటిపర్యంతమయ్యారు.

నైపుణ్య సాధనతో ఉన్నతావకాశాలు



ప్రొఫెసర్ సాంబశివరావును సత్కరిస్తున్న గైస్ ప్రిన్సిపాల్ వెంకటరమణ

మురళీనగర్(విశాఖ ఉత్తర): విద్యార్థులు వారు చదువుతున్న కోర్సుకు సంబంధించిన నైపుణ్యాలు సాధించినప్పుడే ఉన్నత అవకాశాలు పొందుతారని ఇండియన్ సొసైటీ ఫర్ ట్రెనింగ్ అండ్ డెవలప్‌మెంట్(ఐఎస్‌టీడీ) జాతీయ ఉపాధ్యక్షుడు ప్రొఫెసర్ ఎస్.సాంబశివరావు అన్నారు. కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ కాలేజీ(గైస్)లో ఐఎస్‌టీడీ ఆధ్వర్యంలో శుక్రవారం నైపుణ్యాభివృద్ధిపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఐఎస్‌టీడీ గౌరవ కార్యదర్శి డాక్టర్ వై.హేమ విద్యార్థులకు ఐఎస్‌టీడీ స్టూడెంట్ చాప్టర్ విధివిధానాలను వివరించారు. స్టీల్‌ప్లాంట్ పూర్వ జనరల్ మేనేజర్ డాక్టర్ ఒ.రామమోహనరావు సాంకేతిక అంశాలపై ప్రసంగించారు. అనంతరం ప్రొఫెసర్ సాంబశివరావును సత్కరించారు. గైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో సాఫ్టెక్ సొల్యూషన్స్ సీఈవో పి.సునీల్, కాలేజీ డిపార్ట్‌మెంట్ హెడ్ డాక్టర్ బి.వి.లక్ష్మణరావు, డి.దామోదరరావు, ఎస్.ప్రశాంతకుమారి, కె.కోటేశ్వరరావు పాల్గొన్నారు.

ఏఎన్‌ఎంలకు సర్దుబాటు కౌన్సెలింగ్

మహారాణిపేట: జనరల్ నర్సింగ్ మిడ్‌వైఫరీ(జీఎన్‌ఎం) ఉత్తీర్ణత సాధించి ఆక్సిలరీ నర్సింగ్ మిడ్ వైఫరీ (ఏఎన్‌ఎం)గా పనిచేస్తున్న వారికి శుక్రవారం సర్దుబాటు కౌన్సెలింగ్ నిర్వహించారు. డీఎంఈ, వైద్య విధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ వినోద్ కుమార్ ఆదేశాల మేరకు వైద్య ఆరోగ్య శాఖ రీజినల్ డైరెక్టర్ డాక్టర్ ఎస్.ఉమాసుందరి ఈ ప్రక్రియ చేపట్టారు. శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లా, విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో మొత్తం 195 మందికి పోస్టింగ్‌లు ఇచ్చారు. ఎన్నికల కోడ్ అమలులో ఉండడం వల్ల ఎన్నికల కమిషన్ అనుమతి తీసుకొని పోస్టింగ్ ఉత్తర్వులు ఇస్తామని ఆర్డీ తెలిపారు. ఈ మేరకు ఎన్నికల కమిషన్‌కు లేఖ రాస్తామన్నారు.